నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 8 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమిస్తాం

- బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేశ్
- జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం సందర్శన

జైపూర్, డిసెంబర్ 7 : విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమిస్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య.. హాజరుశాతం గురించి ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల గదిలోకి వెళ్లి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, కూరగాయలు ఏ రోజుకు ఆ రోజు తీసుకు వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట మూలంగానే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు నాయకులు వివరించారు. బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకుల నంబర్ మీకు ఇస్తామని, ఏ సమస్య ఉన్నా వాట్సాప్‌లో పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంపత్, బీఆర్ఎస్వీ నాయకులు శ్రావణ్, చైతన్య, నాయకులు మేడి తిరుపతి, బడుగు రవి, తుంగపిండి శేఖర్, సోషల్‌మీడియా నాయకులు దూట శేఖర్, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

వంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విజిత్‌రావు

గురుకులాలపై చిన్నచూపెందుకు?

బీఆర్ఎస్ నాయకుడు విజిత్‌రావు

లక్షెట్టిపేట, డిసెంబర్ 7 : నిరుపేద విద్యార్థులు చదువుకునే గురుకులాలపై సర్కారుకు చిన్నచూపెందుకని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు విజిత్‌రావు ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మహాత్మా జ్యోతిబాపూలే, గురుకులం, మోడల్ డిగ్రీ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలకు పక్కా భవనాలు మంజూరు చేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెనూ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంతకు ముందు వసతిగృహాన్ని కలియదిరిగారు. కిచన్‌లో వంటకు ఉపయోగించే సామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, పెట్టెం తిరుపతి, మెట్టు రాజు, షాబొద్దీన్, సుమన్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇట్లాంటి భోజనం పెడతారా?

చెన్నూర్, డిసెంబర్ 7 : 'అన్నం సరిగా ఉడక లేదు. కూర.. సాంబారు నీళ్లలాగా ఉంది. పిల్లలకు పెట్టేది ఇట్లాంటి భోజనమేనా' అంటూ బీఆర్ఎస్ నాయకులు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. శనివారం చెన్నూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ (బాలుర) గురుకులానికి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. రుచి చూసి నాణ్యతగా లేకపోవడంపై ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావును ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కోరారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చెన్నూర్ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజా రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ఫాయిజన్‌తో 48 మంది విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్ చెలిమల చైతన్య, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శరత్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కోటపల్లి సింగిల్ విండో చైర్మన్ సాంబా గౌడ్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, కో-ఆప్షన్ సభ్యుడు ఆయూబ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్‌రాజ్, మల్లేశ్, ఈర్ల మల్లికార్జున్, పాసం ఆశీష్, భారతి, బడికెల శ్రావణ్, నాయబ్, ఎనగందుల ప్రశాంత్, అన్వర్, మల్లేశ్, విజయ్, నెన్నల భీమయ్య పాల్గొన్నారు.

మందమర్రిలో గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎంజేపీ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

మందమర్రి, డిసెంబర్ 7 : శాంతియుతంగా.. సామరస్యంగా విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన తమను అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ మండిపడ్డారు. మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించడానికి శుక్రవారం రాత్రి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను సిబ్బంది అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల గేటు ఎదుట ధర్నా చేసి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గురుకులాలు అధ్వానంగా మారాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఓ.రాజశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, వెంకటేశ్, పంజాల ఈశ్వర్, భూపెల్లి కనకయ్య, యూత్ సోషల్ మీడియా నాయకులు భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, బెల్లం అశోక్ పాల్గొన్నారు.

శైలజ కుటుంబానికి పరామర్శ

శైలజ కుటుంబాన్ని పరామర్శిస్తున్న అజయ్‌కుమార్, నాయకులు

వాంకిడి, డిసెంబర్ 7 : ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన శైలజ కుటుంబాన్ని వాంకిడి మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తఫా శనివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ శైలజ మృతి చెంది 15 రోజులు గడుస్తున్నా ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలను బహిర్గతం చేయకపోవడం సర్కారు చేతగాని తనమని విమర్శించారు. చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి ఇంత వరకు ఆర్థికసాయమందించకపోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యార్థి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంబార మాజీ సర్పంచ్ సయ్యద్ ఆయూబ్, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ సోయం భీంరావు, నాయకులు రాజ్ కుమార్,నరేందర్,అరుణ్ కుమార్, కృష్ణ రాకేశ్, వినోద్, కృష్ణ, వాసు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై అసమ్మతి.. అసహనం!

మంచిర్యాల జిల్లా శాసనసభ్యులపై రోజు రోజుకూ పెరుగుతున్న వ్యతిరేకత

- గెలిచి ఏడాదైనా ఏం చేయకపోవడమే కారణం
- శంకుస్థాపనలకే పరిమితం.. ఏ ఒక్క పనీ పూర్తి చేయలేదన్న చర్చ
- కొత్త, పాత నాయకుల మధ్య ముదురుతున్న వర్గపోరు
- సొంత పార్టీ ఎమ్మెల్యేలపై గుర్రుగా స్థానిక నేతలు

మంచిర్యాల, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై రోజురోజుకూ అసమ్మతి పెరుగుతున్నది. గెలిచి ఏడాది పూర్తి కావస్తున్నా.. ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంపై ప్రజలతో పాటు అధికార పార్టీలోని సొంత లీడర్లలోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఇక శంకుస్థాపనలు, కొబ్బరికాయలు కొట్టడం తప్ప ఏ ఒక్క పనీ పూర్తి చేసింది లేదన్న చర్చ సాగుతున్నది. ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగిలిన పథకాలేవీ అమలు చేయకపోవడంపై అసహనం వ్యక్తమవుతున్నది. రుణ మాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటూ వచ్చిన నాయకులు, అర్హులైన అనేక మందికి ఎందుకు కాలేదో చెప్పకపోవడంపై కర్షకుల్లో ఆగ్రహం కనిపిస్తున్నది. ఇక గ్యాస్ సబ్సిడీ అమలులోనూ ఇబ్బందులు ఎదురవుతుండగా, రూ. నాలుగువేల పింఛన్, రైతుబంధు, మహిళలకు రూ.2500 వంటివేవీ కార్యరూపం దాల్చకపోవడంతో ఆయా వర్గాల్లో వ్యతిరేకత మొదలైంది. పార్టీ కోసం కష్టపడిన అనేక మంది సీనియర్ నాయకులు జనాలకు ఏమని సమాధానం చెప్పాలో తెలియక.. ఎమ్మెల్యేలపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తున్నది.

పడిపోతున్న ఎమ్మెల్యేల గ్రాఫ్

ముఖ్యంగా చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో గడ్డం బ్రదర్స్‌పై సొంత పార్టీ నాయకుల్లోనే తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నది. ఎమ్మెల్యేలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం నేతల్లో నైరాశ్యానికి కారణమవుతున్నది. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఈ మధ్య నియోజకవర్గంలో రెగ్యులర్‌గా పర్యటిస్తున్నా.. అదంతా వ్యతిరేకత రాకూడదనే ఉద్దేశంతోనే అని తెలుస్తున్నది. ముఖ్యంగా మంత్రి పదవి కోసమే పర్యటిస్తున్నారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ సర్కార్ హయాంలో తీసుకువచ్చిన డీఎంఎఫ్‌టీ ఫండ్స్‌తో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం, కొబ్బరికాయలు కొట్టడం తప్ప వివేక్ ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గానికి సొంతంగా తీసుకువచ్చిన నిధులు, పనులేవీ లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ లీడర్లు మంజూరు చేయించామని చెప్పిన రోడ్లకే.. తాజా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయడం సైతం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. ఇక బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌పై సొంత పార్టీ నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకు వాస్తు మార్పులు తప్ప ఎమ్మెల్యే ఏ పనీ చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచిర్యాల నియోజకవర్గంలోనూ శంకుస్థాపనలు తప్ప, పూర్తి చేసిన పనులు ఏవీ లేవు. పైగా ప్రభుత్వం నుంచి పర్మిషన్లు లేకుండానే ఐబీ చౌరస్తాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేయడం, మార్కెట్ రోడ్డులో కాలువలు తీసి పూడ్చేయడం జనాల్లో తీవ్రమైన చర్చకు దారి తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే పీఏస్పార్ గ్రాఫ్ పడిపోయిందనే చర్చ ఇప్పుడు జిల్లాలో జోరుగా నడుస్తున్నది.

చెన్నూర్-బెల్లంపల్లిలో కొత్త, పాత వర్గపోరు..

ఇక చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో అధికార పార్టీలో కొత్త, పాత నాయకుల వర్గపోరు ముదిరి పాకన పడుతున్నది. భీమారంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడి వర్గానికే పనులు ఇచ్చారంటూ ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న నాయకులు ఆరోపిస్తున్నారు. కిందిస్థాయిలో పార్టీని పట్టుకొని ఉన్న నాయకులకు ప్రాధాన్యం లేకుండా పోయిందని గతంలో ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ చెప్పారు. వాట్సాప్ గ్రూపుల్లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం భీమారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు నిత్యకృత్యంగా మారింది. ఇక బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ ఈ తరహా అసమ్మతి పెరిగిపోయింది. ఇందిరమ్మ కమిటీల్లో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ కాంగ్రెస్ లీడర్లు బహిరంగగానే ప్రెస్‌నోట్ విడుదల చేశారు. అదే జరిగితే తీవ్ర పరిణామాలుంటాయంటూ హెచ్చరించారు. అది మర్చిపోకముందే నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఎమ్మెల్యేపై అసహనం వ్యక్తం చేస్తూ పెట్టిన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. గడిచిన పదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తూ వచ్చామని, మీరు గెలిస్తే మాకు ఏమైనా పనులు చేసి ఆదుకుంటారనుకున్నామని.. కానీ మీరు మాత్రం బీజేపీ నుంచి వచ్చిన కార్యకర్తల కోసం మాత్రమే పని చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మీరు చేపట్టిన పనులన్నీ ఒక్కలీడర్‌కే ఇస్తే స్థానిక లీడర్లు ఏమైపోవాలంటూ ప్రశ్నించారు. ఈ ఘటనలే అధికార పార్టీపై అటు జనాలు, ఇటు సొంత పార్టీ నాయకుల్లో అసమ్మతికి ఉదాహరణలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఇప్పటికైనా ఎమ్మెల్యేలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

సర్కారుపై బీఆర్ఎస్ కన్నెర్ర

- తెలంగాణ తల్లి విగ్రహ రూపం మార్చడంపై ఆగ్రహం
- అస్నాద్ చౌరస్తాలో నిరసన

చెన్నూర్, డిసెంబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. ఈ మేరకు శనివారం పార్టీ సీనియర్ నాయకుడు రాజా రమేశ్ ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణంలోని అస్నాద్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ప్రతిరూపమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ పండుగలకు ప్రతీక అయిన బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో నుంచి మాయం చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులు, పేదలు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునేలా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి పెడితే.. తాము అధికారంలోకి వచ్చిన గంటలోపే వాటన్నింటినీ తొలగిస్తామన్నారు. ఇప్పటికైనా ఆ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కోటపల్లి సింగిల్‌విండో చైర్మన్ సాంబాగౌడ్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, కో ఆప్షన్ సభ్యుడు ఆయూబ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్‌రాజ్, జడల మల్లేశ్, ఈర్ల మల్లికార్జున్, ఆశీష్, బోగే భారతి, బడికెల శ్రావణ్, నాయబ్, ప్రశాంత్, అన్వర్, మల్లేశ్, విజయ్, నెన్నల భీమయ్య పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

జన్నారం పొనకల్ కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

దుబ్బ గూడెంలో ధాన్యం కుప్పల వద్ద నీటిని తీస్తున్న రైతు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

దండేపల్లి/నెన్నెల/జన్నారం/వేమనపల్లి/కన్నెపల్లి/హాజీపూర్, డిసెంబర్ 7 : జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు నష్టపోవాల్సి వచ్చిం ది. దండేపల్లి మండలం తాళ్లపేటలో శనివారం వర్షం పడగా, పలుచోట్ల ధాన్యం తడిసింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. నెన్నెలలో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కుప్పల చుట్టూ నీరు నిల్వకుండా కాలువలు తవ్వారు. ఇక చేల ల్లో ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసింది. దూది రంగు మారి ధర రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జన్నారంలోని మార్కెట్ యార్డులో గల ధాన్యం కుప్పల్లోకి వరద వచ్చి చేరింది. తడిసిన ధాన్యాన్ని కోనుగోలు చేయాలని రైతులు జూనుగూరి మల్లయ్య, జాడి గంగాధర్ కోరారు. శనివారం సాయంత్రం కూడా వర్షం పడడంతో రైతులు ధాన్యం తడవకుండా కవర్లు కప్పుకున్నారు. వేమనపల్లి మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కల్లాల్లోని ధాన్యం, చేలల్లోని పత్తి తడిసింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కన్నెపల్లి, హాజీపూర్ మండలాల్లోనూ వర్షానికి రైతులు నష్టపోవాల్సి వచ్చింది.

తాళ్లపేట వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, ఓనర్లు

హామీలు నెరవేర్చాలని ఆటో డైవర్ల బంద్

దండేపల్లి/చెన్నూర్/తాండూర్, డిసెంబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం దండేపల్లి మండలం తాళ్లపేటలో ఆటో డ్రైవర్లు బంద్ పాటించి ఆందోళనకు దిగారు. తాళ్లపేట న్యూ ఆటో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి ఇస్తామన్న రూ.12వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా 66 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుసుకున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చెన్నూర్ పట్టణంలో ఆటో డ్రైవర్లు బంద్ పాటించారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర నాన్ పొలిటికల్ జేఏసీ పిలుపు మేరకు శనివారం తాండూర్ మండల ఆటో కార్మికులు బంద్ పాటించారు. తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15 వేల జీవన భృతి ఇవ్వాలని, రూ. 1000 కోట్లతో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు చాంద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కొత్త శంకర్, సహాయ కార్యదర్శి పల్లె వెంకటేశ్, కోశాధికారులు ఒరగంటి శుభాకర్, రఫీఖాన్, సలహాదారులు విద్యాసాగర్, టౌన్ అధ్యక్షుడు వాసాల సాయి, రేచిని అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జపతి సతీశ్ పాల్గొన్నారు.

తాండూర్‌లో బంద్ పాటిస్తున్న ఆటో కార్మికులు